క్లుప్తంగా

గ్రామాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలి



మురుగు కాలువలో ఆయిల్ బాల్స్ వేస్తున్న దృశ్యం

సి.బెళగల్: గ్రామాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ రాముడు అన్నారు. శుక్రవారంమండల కేంద్రం సి.బెళగల్‌లో వైద్య సిబ్బంది చేపట్టిన మురుగు కాల్వలల్లో ఆయిల్ బాల్స్ విడుదల కార్యక్రమాన్ని ఈఓఆర్డీ సందీప్‌తో కలిసి పరిశీలించారు. ఎంపీడీఓ స్థానికులతో మాట్లాడారు. దోమల వ్యాప్తి నియంత్రణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ మంగమ్మ ఆలస్యంగా రావడం పై ఎంపీడీఓ హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశాలు బి.ఉషారిణి శేషమ్మ, మార్థమ్మ, రాజకుమారి, మంగమ్మ, రంగమ్మ, క్లాప్ మిత్ర నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సుంకేసులకు 350 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు శుక్రవారం 350 క్యూసెక్కుల నీటి ఇన్‌ఫ్లో ఉంది. కర్నూలు నగర ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం కేసీ కాల్వకు 189 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. డ్యామ్‌లో 1.194 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోడుమూరు: విద్యుత్ సబ్‌స్టేషన్లలో ట్రాన్స్‌ఫార్మర్‌లు, 33కేవీ పులకుర్తి లిఫ్ట్ స్కీం మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నియోజకవర్గంలోని కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ట్రాన్స్‌కో డీఈఈ జేసన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, రైతులు, వ్యాపారస్తులు సహకరించాలని కోరారు.

నేడు సామాజిక తనిఖీ సమావేశం

కర్నూలు (న్యూటౌన్): జెడ్పీలోని కర్నూలు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈ నెల 13న ఉదయం 10గంటలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై సామాజిక తనిఖీ సమావేశం ఉంటుందని ఏపీఓ మహమ్మద్ బాషా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీలో గుర్తించిన అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఉపాధి ఉద్యోగులు, సిబ్బంది తప్పకుండా హాజరు కావాలని కోరారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కర్నూలు(న్యూటౌన్): కర్నూలు మండలం సూదిరెడ్డిపల్లెలో ఈనెల 13వ తేదీన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కర్నూలు ఎంపీడీఓ ఎస్.భాస్కర్‌నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ హాజరవుతారన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి సమస్యలను అడిగి తెలుసుకుంటారని పేర్కొన్నారు. అధికారులు గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పకుండా హాజరుకావాలని సూచించారు.

ఎంపీ నిధులతో బోర్లు ఏర్పాటు

గూడూరు రూరల్: మండల పరిధిలోని చనుగొండ్లలో ఎంపీ నిధుల కింద రెండు బోర్లు ఏర్పాటును శుక్రవారం వైఎస్సార్సీపీ నాయకుడు మహేశ్వరరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు దౌల చేపట్టారు. వారు మాట్లాడుతూ గ్రామంలో జనాభా పెరిగిపోవడంతో తాగునీటి కొరత ఏర్పడిందన్నారు. తాగునీటి సమస్యను ఎంపీ సంజీవ్‌కుమార్ దృష్టికి తీసుకునివెళ్లగా రెండు బోర్లను మంజూరు చేశారన్నారు.

సర్వేను పకడ్బందీగా చేపట్టాలి



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాముడు

సి.బెళగల్: గ్రామాలలో జరుతుగున్న బడి బయటి విద్యార్థుల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని, నిర్లక్ష్యం వహించే ఉద్యోగులు, వలంటీర్లపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎంపీడీఓ రాముడు అన్నారు. శుక్రవారం ఆయన ఈఓఆర్డీ సందీప్‌తో కలిసి సి.బెళగల్ గ్రామ సచివాలయం-1ను తనిఖీ చేశారు. రికార్డులు, ఉద్యోగులు, వలంటీర్ల హాజరు, పరిసరాలను పరిశీలించి కార్యాలయ నిర్వహణపై శ్రద్ధ వహించాలని పంచాయతీ కార్యదర్శి నాగరాజుకు ఎంపీడీఓ సూచించారు. కార్యక్రమంలో సచివాలయ ఉదోయగలు బాబురావు, శ్రావణి, సహీన, శ్రీరాములు, వలంటీర్లు పాల్గొన్నారు.

భూముల సమగ్ర సర్వే.. సమస్యలకు చెక్!

- రీ సర్వేతో తొలగనున్న వివాదాలు
- మంచాలకట్ట గ్రామంలో దాదాపు పూర్తి
- త్వరలో డ్రోన్‌లతో రీ సర్వే

గడివేముల: వ్యవసాయ రంగానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తుంది. పెట్టుబడి సాయం నుంచి దిగుబడులు అమ్ముకునేంత వరకు రైతన్నకు ప్రభుత్వం అన్నిరకాలుగా అండగా నిలుస్తుంది. ఈ నేపథ్యంలో ఏళ్లతరబడి నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. ప్రతిష్టాత్మకంగా వైఎస్సార్ జగనన్న శాశ్వతహక్కు–భూ పరిరక్షణ పథకం అమలుకు శ్రీకారం చుట్టింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గతేడాది డిసెంబర్ 21 వతేదీన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ మేరకు గడివేముల మండంలోని మంచాలకట్ట గ్రామాన్ని పైలేట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు అధికారులు. రీ సర్వేపై ప్రయోజనాలపై సదస్సులు నిర్వహించి రైతులను చైతన్య పరిచారు. ఆ గ్రామంలో 185 సర్వే నంబర్లలో 746.93 ఎకరాల్లో రీసర్వే పనులు దాదాపు పూర్తయ్యాయి. అదేవిధంగా మొదటి విడతగా గడివేముల, తిరుపాడు, కొరటమద్ది, దుర్వేశి గ్రామాలను ఎంపిక చేసిన అధికారులు భూముల రీ సర్వే పనులు చేపట్టారు. ఈ సర్వేను ఆధునిక సాంకేతిక పరికాలతో సర్వే చేస్తున్నారు. త్వరలో డ్రోన్ల ద్వారా ఛాయా చిత్రాలు తీసి భూముల వివరాలను గుర్తించనున్నారు. రాబోయే కాలంలో యాజమానులకు భూ లావాదేవీలకు ఇబ్బంది ఉండదు. ఏళ్లతరబడి నెలకొన్న భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుండంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



మంచాలకట్ట గ్రామంలో సర్వే చేస్తున్న సర్వేయర్లు

భూ వివాదాలు ఉండవు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన భూముల రీసర్వేతో గ్రామా ల్లో భూవివాదాలు ఉండవు. పొలాలు అమ్ముకోవడానికి, కొనడానికి ఇబ్బందులు తొలగుతాయి. ప్రతి గ్రామంలో భూముల హద్దులకు సంబంధించి చాలా గొడవలు జరుగుతున్నాయి. సమస్యల పరిష్కారానికి ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతూనే ఉన్నారు రైతులు. రీ సర్వేతో రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండదు. సీఎం నిర్ణయం చాలా మంచిది. –అనిల్‌కుమార్‌రెడ్డి, రైతు, మంచాలకట్ట గ్రామం

రోవర్ ద్వారా మ్యాపులు తయారు చేస్తున్నాం

ఐదుగ్రామాలలో రోవర్ పరికరం ద్వారా మ్యాపులు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తే డ్రోన్‌లను పంపిస్తారు. డ్రోన్లతో పొలాల ఛాయచిత్రాలు తీసి సర్వేనంబర్ వారీగా మ్యాపు తయారు చేస్తాం. అనంతరం డ్రోన్ ద్వారా తీసిన మ్యాపుల ఆధారంగా పొలానికి సంబంధించి హద్దు రాళ్లు వేయడం జరుగుతుంది. భూమి కొలతలో ఎలాంటి తేడాలు లేకుండా చూసేందుకు ప్రభుత్వం రీ సర్వేలు పనులు చేపట్టింది. భవిష్యత్‌లో పొలం తగాదాలు ఉండవు. –మహాలక్ష్మి, సర్వేయర్,గడివేముల

సెంటు కూడా తేడా ఉండదు



ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వతహక్కు–భూ పరిరక్షణ పథకం రైతులకు ఉపయోగకరం. సెంటు కూడా తేడా ఉండకుండా రీసర్వే చేస్తున్నాం. ఏళ్లతరబడి ఇబ్బంది పడుతున్న రైతులకు న్యాయం జరుగుతుంది. భవిష్యత్‌లో ఎలాంటి సమస్యలు తలెత్తవు. రీసర్వే పూర్తయ్యా సచివాలయాల్లో జాబితాను ప్రదర్శిస్తామన్నారు. –శ్రీనివాసులు,తహసీల్దార్,గడివేముల

భూ సర్వేకు రైతులు సహకరించాలి

ఓర్వకల్లు: ప్రభుత్వం చేపడుతున్న భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని తిప్పాయపల్లె గ్రామంలో రీ సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ భూముల విస్తీర్ణంలో ఎక్కువ తక్కువలు రావడంతో రైతులు తీవ్ర ఇబ్బంధులను ఎదుర్కోవాల్సి వుండేదన్నారు. రైతుల సమస్యను దృష్టిలో పెట్టుకొని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకాన్ని అమలు చేయడం జరిగిందన్నారు. అందులో భాగంగా ' మీ భూమి..మా హామీ' పేరుతో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో భూ సర్వేలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు మండలంలో 12 గ్రామాలలో సర్వే పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ నెల 16న మండలంలోని కన్నమడకల, హుసేనాపురం, లొద్దిపల్లె లో గ్రామ సభలు నిర్వహించి రీ సర్వే చేపట్టనున్నట్లు వెల్లడించారు.

నాడు-నేడు పనులను వేగవంతం చేయండి

గడివేముల: ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ ఏఈ భాస్కర్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని గడిగరేవుల గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న నాడు–నేడు పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

ఉద్యాన పంటల సాగుతో లాభాలు

- డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

కర్నూలు (న్యూటౌన్): ఉద్యాన పంటల సాగుతో లాభాలు పొందవచ్చని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి అన్నారు. శుక్రవారం కర్నూలు మండలం గార్గేయపురం గ్రామంలో అచ్చెమ్మ తన మూడెకరాల్లో సాగు చేసిన చీనితోటను ఆయన పరిశీలించారు. అనంతరం ఉపాధి హామీ పనులను తనిఖీ చేసి కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో మామిడి, చీని, నిమ్మ, జామ, సపోట, కొబ్బరి, సీతాఫలం, అల్ల నేరేడు, చింత, ఆపిల్ బేర్, డ్రాగన్ ఫ్రూట్, గుండె మల్లెలు, గులాబి పూల సాగు చేసుకోవచ్చన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 100 శాతం సబ్సిడీతో తోటల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందన్నారు. పండ్ల తోటలు, పూలతోటలను పెంచుకుని సుస్థిర ఆర్థికాభివృద్ధి చెందేందుకు చిన్నకారు, సన్నకారు కుటుంబాలకు ప్రభుత్వం కల్పించిన మంచి అవకాశాన్ని



గార్గేయపురంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

ఐదెకరాల్లోపు రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి రోజూ 6గంటలకే ఉపాధి కూలీలు ఫీల్డ్‌లో పని చేసేలా చూడాలని సూచించారు. అలాగే ఉపాధి కూలీలకు రోజుకు కనీస వేతనం రూ.272 కూలీ పడేలా పనులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పీడీ వెంట మండల ఇంజినీర్ మనోహర్‌రెడ్డి, ఏపీఓ మహమ్మద్‌బాషా, టెక్నికల్ అసిస్టెంట్ మల్లీశ్వరి, ఫీల్డ్ అసిస్టెంట్ సుమన్ ఉన్నారు.

'జగనన్నకు చెబుదాం' సమస్యలకు పరిష్కారం చూపాలి

- కర్నూలు ఆర్డీఓ హరి ప్రసాద్

కర్నూలు (న్యూటౌన్): 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో వచ్చిన సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్ వీఆర్‌ఓలను ఆదేశించారు. శుక్రవారం కర్నూలు రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఆర్ శివరాముడుతో కలిసి వీఆర్‌ఓలతో ఆర్డీఓ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన సమస్యలకు కచ్చితంగా పరిష్కారం చూపాలని సూచించారు. ఆ సమస్యలు ఆన్‌లైన్‌లో రీ ఓపెన్ కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత వీఆర్‌ఓ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ హరిప్రసాద్

లదేనని ఆదేశించారు.అర్జీదారుల సమస్యను పూర్తిగా విని వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో డీటీ సాహరాబాను, ఆయా గ్రామాల వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

సి.బెళగల్: వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ మల్లేష్‌కుమార్ సూచించారు. స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఏఓ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సూక్ష్మపోషకాలైన జింక్, జిప్సంను వంద శాతం, పిల్లిపెసర, జీలుగా యాబై శాతం రాయితీపై అందజేయడం జరుగుతుందన్నారు. రాయితీపై వ్యవసాయ పరికరాలు, యంత్రాలను ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో అందించడం జరుగుతుందని తెలియజేశారు.

అనుమతుల విత్తనాలనే అమ్మాలి

రైతులకు ప్రభుత్వ అనుమతులున్న విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను ఎంఆర్పీ ధరలకే అమ్మకాలు జరపాలని ఏఓ మల్లేష్ కుమార్ తెలిపారు. స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల డీర్లలతో



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ మల్లేష్‌కుమార్

నిర్వహించిన సమావేశంలో ఏఓ మాట్లాడారు. నిషేధిత మందులు, విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మందుల కొనుగోలు దారులకు తప్పనిసరిగా రషీదులు ఇవ్వాలని, ధరలు, నిల్వల బోర్డులను ప్రదర్శించాలని సూచించారు. సమావేశంలో ఎంపీఈఓలు వెంకటేష్, ఈశ్వర్, వీఏఏఎస్ బిందు, అంజలి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత సీట్లకు దరఖాస్తు చేసుకోండి

పాణ్యం: ప్రైవేట్ పాఠశాలలో పేద విద్యార్థులకు ప్రభుత్వం 25శాతం సీట్లు కల్పించిందని, దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ కోటయ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 15వ తేదీ వరకు గడువు ఉందని, ప్రైవేట్ స్కూళ్లలో సీట్ వచ్చిన పేద విద్యార్థుల ఫీజు ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పారు. పూర్తి వివరాలకు ఎంఆర్‌సీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- అర్హతే ప్రామాణికంగా పేదలకు సంక్షేమ పథకాల వర్తింపు
- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్



నూతనపల్లెలో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను అందజేస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): పేదల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ పేర్కొన్నారు. అర్హతే ప్రామాణికంగా పార్టీలు, కుల మతాలు, వర్గాలకు అతీతంగా పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని గుర్తు చేశారు. కర్నూలు మండలం నూతనపల్లె గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా గోకారిసాహెబ్ దర్గాలో ఎమ్మెల్యే టెంకాయ సమర్పించి, ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. అనంతరం నాయకులు, అధికారులతో కలిసి గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికి వెళ్లి నాలుగేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు వివరించడంతోపాటు ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకన్నారు. అర్హత ఉండికూడా సంక్షేమ పథకాలు అందనివారు ఉంటే తమ దృష్టికి తేవాలని, అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కోడుమూరు ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేని అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ప్రజాసంకల్పయాత్రలో ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా నెరవేర్చారన్నారు. ప్రజల వద్దకే పాలన సాగించేందుకు మరోమారు సీఎం వైఎస్ జగన్‌ను ఆశీర్వాదించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలకు పిలుపునిచ్చారు.

ఓర్వలేకనే విమర్శలు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన పేదలందరికీ మంచి చేస్తుంటే ఓర్వలేని ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు, దత్త పుత్రుడు పవన్ కల్యాణ్ అసత్యారోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ విమర్శించారు. గత ఎన్నికల్లో చంద్రబాబు 600 హామీలిచ్చి ఏ ఒక్కటీ నెరవేర్చకుండా గాలికొదిలేశారని ఎద్దేవా చేశారు. ప్రతి కుటుంబానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లబ్ధి చేకూర్చుతుందని, నేరుగా వారి ఖాతాల్లో నగదు జమ చేస్తుందని గుర్తు చేశారు. మాయమాటలతో మభ్యపెట్టడం చంద్రబాబు నైజమని, రాబోయే ఎన్నికల్లో మరోమారు గట్టిగా గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ టి లక్ష్మీదేవి, జడ్పీటీసీ ప్రసన్నకుమార్, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ మహబూబ్‌బాషా, మాజీ మండల ఉపాధ్యక్షులు వాసు, గ్రామ సచివాలయ కన్వీనర్లు కృష్ణ, మధుగౌడు, మధు, ఎంపీడీఓ భాస్కర్ నాయుడు, పంచాయతీ కార్యదర్శి హేమంత్‌కుమార్‌రెడ్డి, ఎలక్ట్రికల్ ఏఈ ఆంజనేయశాస్త్రి, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రామేశ్వరి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న భూహక్కు పత్రాలను అందజేస్తాం

కర్నూలు(న్యూటౌన్): మండల పరిధిలోని భూము ల రీసర్వే పూర్తయ్యాక రైతులకు జగనన్న భూహక్కు పత్రాలను అందజేస్తామని కర్నూలు ఆర్‌డీఓ హరిప్రసాద్ అన్నారు. శుక్రవారం సాయంత్రం కర్నూలు మండలం నూతనపల్లెలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష కార్యక్రమంపై ఆర్డీఓ రైతులతో మాట్లాడారు. ఈ పథకం రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. గ్రామాల్లో రైతుల మధ్య నెలకొన్న భూ వివాదాలు పూర్తిస్థాయిలో పరిష్కారమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో కర్నూలు రూరల్ తహసీల్దార్ శివరాముడు, నూతనపల్లె గ్రామ రైతులు పాల్గొన్నారు.

గురుకులంలో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి చేరేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మేరీ సలోమి శుక్రవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు 3వ తరగతి నుంచి ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. పూర్తి చేసిన దరఖాస్తులను కార్యాలయంలో అందజేయాలన్నారు. అలాగే కర్నూల్, నంద్యాల, ప్రకాశం జిల్లాలకు చెందిన విద్యార్థులు అర్హులన్నారు. లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. జూన్ 05వ తేదీ వరకు గడువున్నట్లు తెలిపారు.

డ్రమ్ముల్లో నీరు నిల్వలేకుండా చూసుకోవాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్య

కల్లూరు: ప్రజలు డ్రమ్ముల్లో, నీటి తొట్లల్లో, గచ్చుల్లో నీరు నిల్వలేకుండా చూసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్య సూచించారు. శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా మండలంలోని బస్తిపాడు గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వారానికి ఒకసారి నీటి నిల్వలు లేకుండా పూర్తిగా తొలగించి దోమలు, లార్వాల పెరుగుదలను అరికట్టవిధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామాల్లో నీటి నిల్వలు గల ప్రాంతాలను గుర్తించినట్లయితే ఆ వివరాలను వెక్టార్ కంట్రోల్ హైజిన్ యాప్ నందు అప్‌లోడ్ చేసి సంబంధిత సచివాలయ కార్యదర్శి ద్వారా సమస్య పరిష్కారమయ్యేలా చూడాల



డ్రమ్ములోని నీటిని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్య

న్నారు. అనంతరం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి ఐరన్ మాత్రలను, ఐరన్ సిరప్‌లు ఉన్నాయా, గర్భిణులకు, పిల్లలకు సమయాను సారంగా ఇస్తున్నారా అని ఆరాతీశారు. కార్యక్రమంలో కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆశా కార్యకర్త రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులందరికీ రైతుభరోసా అందాలి

గడివేముల: సాగు అవసరాల కోసం రైతులకు అందిస్తున్న రైతుభరోసా అర్హులైన రైతులందరికీ అందాలని నంద్యాల జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రమైన గడివేములతో పాటు చిందుకూరు ఆర్బీకేలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా ఆర్బీకేలలో ఇప్పటికే రైతుభరోసా అర్హుల, అనర్హుల జాబితాను ప్రదర్శించడం జరిగిందన్నారు. రైతులు జాబితాను చూసుకోవాలని, అర్హత ఉంటే ఈనెల 15వ తేదీ లోపల స్థానిక వీఏఏకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 20వ తేదీన తుది జాబితాను విడుదల చేయడం జరుగుతుందన్నారు. రబీ సీజన్ పండించిన మొక్కజొన్నలకు



రైతుభరోసా జాబితాను పరిశీలిస్తున్న మోహన్‌రావు

ప్రభుత్వం రూ.1962 మద్ధతుధర కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఏఓ హేమసుందర్‌రెడ్డి, వెటర్నరీ డాక్టర్ సాయిహరిణి, వీఏఏలు,రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

కోడుమూరు రూరల్ : ప్రతి మూడు నెలలకోసారి జరిగే మండల సర్వసభ్య సమావేశంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చే సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని కోడుమూరు జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గాడి రూతమ్మ అధ్యక్షతన ఎంపీడీఓ చంద్రశేఖర్ మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సభనుద్దేశించి జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్ల పనితీరు సరిగా లేదని, మెరుగుపరుచుకోవాలన్నారు. ఏఓ రవిప్రకాష్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కుగాను రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, మందుల కొరత లేదని, ఆర్‌బీకేల్లో అన్ని అందుబాటులో ఉన్నాయన్నారు. ఎస్ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ప్రసాద్ మాట్లాడుతూ మండలంలోని కోడుమూరు, గోరంట్ల, కల్లపరి, కొత్తూరు, లద్దగిరి, అమడగుంట్ల, పులకుర్తి, కల్లపరి గ్రామాల్లో నీటి సమస్య పరిష్కారానికి జలజీవన్ మిషన్ కింద రూ.4.24కోట్లు మంజూరైనాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. ఏపీఓ రమాదేవి మాట్లాడుతూ గ్రామాల్లో వలసల నివారణకై ప్రభుత్వం కూలీలందరికి ఉపాధి పనులు కల్పిస్తోందన్నారు. ఎంపీడీఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ సభలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను ఆయా శాఖల అధికారులు పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ శేషఫణి, ఎంఈఓ అనంతయ్య, హెచ్ఓ మదన్‌మోహన్, ఏఈలు గంగరాజు, బసీర్‌అహ్మద్, ఫారుక్‌హుసేన్,సుజాత, ఈఓఆర్డీ మంజుల తదితరులు తమ తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను చదివి విన్పించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు మాధవి, ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రఘునాథ్‌రెడ్డి



రైతులకు సబ్సిడీపై రోటవేటర్స్‌ను అందిస్తున్న వ్యవసాయాదికారులు

పంట మార్పిడిని పాటించాలి

గూడూరు: రైతులు పంట మార్పిడి పద్ధతులు అవలంబిస్తే మంచి దిగుబడులు వస్తాయని వ్యవసాదికారి శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయాదికారి కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం ఏఓ అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ మట్టి పరీక్షలు చేయించుకోవాలని, వాటి ఆధారంగా పంటలు సాగుచేసుకోవాలన్నారు. అనంతరం గూడూరు ఆర్‌బీకే–3 పరిధిలోని వెంకటేశ్వర రైతు మిత్ర గ్రూపునకు సబ్సిడీపై రెండు రోటవేటర్స్ ఏఓ అందించారు. కార్యక్రమంలో వీఆర్వోలు తిమ్మన్న, ఏఈఓలు లక్ష్మినారాయణ, శ్రీవాణి, ఎంపీఈఓలు , రైతులు పాల్గొన్నారు.